సాక్షి ప్రకాశం

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025

I



బస్సులెక్కగలవా.. ఓ నరుడా

కూటమి ప్రభుత్వ నిర్వాకంతో బస్సులెక్కాలంటేనే జనం భయపడే పరిస్థితి నెలకొంది. ప్రయాణికులకు సరిపడా బస్సులు లేవు. - IIలో..



టీడీపీ నాయకుడి దౌర్జన్యంపై నిరసన

ఒంగోలులో 20 ఏళ్లుగా నివాసం ఉంటున్న తమ ఇంటిని కూలగొడతామని టీడీపీ నాయకుడు బెదిరిస్తున్నాడని బాధితులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
30 /24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

శాకంబరీ నమోస్తుతే..



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని రోజుకో రీతిగా అలంకరిస్తున్నారు. ఒంగోలులోని అచలానందాశ్రమంలోని గోవిందమాంబ అమ్మవారిని శనివారం శాకంబరిదేవి (పార్వతీదేవి)గా వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. - సాక్షి, ఒంగోలు

న్యూస్‌రీల్

బాలకృష్ణ అసభ్యకరంగా మాట్లాడటం సిగ్గుచేటు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



ఒంగోలు సిటీ: ప్రముఖ సినీ నటుడు చిరంజీవిని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అసభ్యకరంగా మాట్లాడటం సిగ్గుచేటని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ బాలకృష్ణ నోటికొచ్చినట్లు మాట్లాడటం మంచిపద్ధతి కాదని హితవు పలికారు. సభా మర్యాదలు పాటించాల్సిన ప్రజాప్రతినిధులే అలా మాట్లాడితే ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని విమర్శించారు.

నిర్వాసితులను ముంచేశారు..

- నిధులిచ్చి ఆదుకోండి మహాప్రభో
- వెలిగొండ నిర్వాసిత గ్రామాల ప్రజల మొర
- పునరావాస గ్రామాలకు నిధులివ్వని కూటమి సర్కార్
- మార్కాపురం, అర్ధవీడు, పెద్దారవీడు మండలాల్లో 11 ముంపు గ్రామాలు
- చంద్రబాబు ప్రభుత్వం అడుగడుగునా వివక్ష
- ఒక్కరూపాయి కూడా విదల్చని సర్కార్
- 15వ ఆర్థిక సంఘం నిధులతో అరకొరగా పనులు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్వాసితులకు కాలనీలు
- రోడ్లు, పాఠశాలలు, వాటర్ ట్యాంకులు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం

కన్నతల్లిలాంటి ఊరిని నమ్ముకొని సాగిన జీవనాన్ని వెలిగొండ ప్రాజెక్టు కోసం వదులుకున్నారు.. తాత, ముత్తాతల నుంచి పుట్టి పెరిగిన ఊరును, చెరగని జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ స్వగ్రామం నుంచి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. లక్షలాది ఎకరాలకు సాగునీరు..లక్షల మందికి తాగునీరు కోసం వారు ఎంతో త్యాగం చేశారు. అటువంటి నిర్వాసితులకు అండగా నిలవాల్సిన పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా వారి బాగోగులు పట్టించుకున్న పాపాన పోలేదు. నిర్వాసిత కాలనీలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వం ఒక్కపైసా కూడా విదల్చలేదు. మంత్రులు వస్తున్నారు..వెళ్తున్నారు.. కానీ వీరివైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు.



అభివృద్ధికి నోచుకోని అక్కచెరువు తండాలోని వీధి



అధ్వానంగా ఉన్న అక్కచెరువు తండాకు వచ్చే రోడ్డు

సాక్షి ఫోకస్

మార్కాపురం:

జిల్లాలో కరువు విలయతాండవం చేస్తున్న సమయంలో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర రెడ్డి పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 4.477 లక్షల ఎకరాలకు సాగునీరు, 15.20 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రాజెక్టుకు రూపకల్పన చేసి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. శరవేగంగా పనులు సాగాయి. ఆయన అకాల మరణంతో ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. 2014 నుంచి 2019 చంద్రబాబు పాలనలో వెలిగొండ దాదాపుగా మూలనపడింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎంగా జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. దాదాపుగా పనులన్నీ పూర్తి చేసి ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. మరో వైపు నిర్వాసితులకు అండగా నిలిచారు. మార్కాపురం మండలం గొట్టిపడియ, అక్కచెరువు తాండ నిర్వాసితులకు మార్కాపురం మండలం కుంట వద్ద, పెద్దారవీడు మండలం సుంకేశుల, కలనూతల, చింతలముడిపి గ్రామాల వారికి గోగులదిన్నె వద్ద, సుంకేశులలోని ఎస్సీలకు తోకపల్లి వద్ద కలనూతలలో, కొంతమంది నిర్వాసితులకు ఇడుపూరు వద్ద కాలనీలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సిమెంటు రోడ్లు, వాటర్ ట్యాంకులు, కమ్యూనిటీ హాలు, పాఠశాలలను నిర్మించారు. గతంలో పునరావాసానికి రూ.1.80 లక్షలు ప్రకటిస్తే జగన్ మోహన్‌రెడ్డి దానిని రూ.12.50 లక్షలకు పెంచారు. పునరావాసుల కోసం రూ.1400 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీటిని పట్టించుకోకపోవడంతో చిల్లచెట్లు, పిచ్చికంపతో నిండిపోయి అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారింది. దీంతో నిర్వాసితుల్లో ఒకరకమైన నిరాశ, నిస్పృహలు ఏర్పడ్డాయి.

శిథిలమవుతున్న గృహాలు:

ప్రాజెక్టు పరిధిలో 11 గ్రామాల ప్రజలు ప్రస్తుతానికి సొంతూళ్లలోనే ఉంటున్నారు. మొత్తం 7270 కుటుంబాలు ఉన్నాయి. పునరావాస కాలనీల్లో ఇళ్ల నిర్మాణం కాకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్న గృహాల్లోనే బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ గ్రామాల్లో అంతర్గత రోడ్లు లేక అధ్వానంగా మారాయి. డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణానికి వచ్చేందుకు లింకు రోడ్లు కూడా శిథిలమైపోయాయి. ఆటోలు తిరిగేందుకు కూడా ఇబ్బందికరంగా ఉన్నాయి. అధికారులను ప్రశ్నిస్తే పునరావాస గ్రామాలుగా ప్రకటించినందున ప్రభుత్వం నిధులు విడుదల చేయటం లేదని జవాబు ఇస్తున్నారు. దీంతో అటు పునరావాస కాలనీలు ప్రారంభం కాక, ఇటు గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోవటంతో శిథిలమైన గృహాల్లో వారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

15వ ఆర్థిక సంఘం నిధులతో అరకొరగా..

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. నిర్వాసిత గ్రామాలుగా ప్రభుత్వం ప్రకటించటంతో నిధులు నిలిచిపోయాయి. కేవలం గ్రామ పంచాయతీలకు వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులతోనే తాత్కాలిక అవసరాలను సర్పంచ్‌లు తీరుస్తున్నారు. ఇంతకుమించి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం ముంపు గ్రామాల అభివృద్ధికి కేటాయించటంలేదు. అటు పునరావాసం కల్పించక, ఇటు నిధులు కేటాయించక గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, పాఠశాలల ప్రహరీలు, శ్మశానాల అభివృద్ధి తదితర వాటికి నిధులు లేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతుండగా ప్రజలు ఎగుడు, దిగుడుగా ఉన్న రోడ్లపై నడవలేక అవస్థలు పడుతున్నారు. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు చూస్తే ఇప్పట్లో వెలిగొండ పూర్తికాదనే విషయం అర్థమవుతోంది.

“ మా గ్రామాలను చూడండి సారూ..



మా గ్రామాలను ఒక్కసారి చూడండి సారూ. మేమెన్ని అవస్థలు పడుతున్నామో. అక్కచెరువు తండా గొట్టిపడియ డ్యామ్ కింద ఉంది. వర్షం వస్తే మా గుండెలు గుభేల్‌మంటాయి. ఎక్కడ నీళ్లొచ్చి మునిగిపోతామేమోనని భయం. వర్షం వస్తే కరెంటు పోతుంది. ఈ మధ్య తండాల్లోకి పెద్దపులి వస్తుంది. రాత్రయితే భయం భయంగా ఉంటాం.

– సోమ్లాబాయి, అక్కచెరువు తండా

“ పునరావాస గ్రామాలపై వివక్ష



పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పెద్దారవీడు మండలంలోని సుంకేశుల డ్యామ్ వలన సుంకేశుల, గుండంచర్ల, కాటంరాజు తండా, కలనూతల, చింతలముడిపి గ్రామాలు మునిగిపోనున్నాయి. ఈ గ్రామాల్లో పంచాయతీ నిధులు తప్ప ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా ఏమీ రావడం లేదు. ప్రభుత్వం పునరావాస గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించి నిధులు విడుదల చేసి అభివృద్ధి చేయాలని కోరుతున్నాం.

– జీ రమేష్, సర్పంచ్, సుంకేశుల గ్రామం

ప్రాజెక్టు పరిధిలో 11 ముంపు గ్రామాలు

ముంపు గ్రామం	నిర్వాసితుల సంఖ్య
కలనూతల	1118
చింతలముడిపి	88
సుంకేశుల	2901
గుండంచర్ల	1201
కాటంరాజు తండా	38
అక్కచెరువు	158
గొట్టిపడియ	1420
సాయిరాంనగర్	26
రామలింగేశ్వరపురం	36
కృష్ణానగర్	78
పొట్టిబసవాయిపల్లి (లక్ష్మీపురం)	206

“ మా గ్రామాలను ఒక్కసారి చూడండి



మా గ్రామాలను ఒక్కసారి అధికారులు వచ్చి చూడండి. రోడ్లు, కాలువలు లేక వర్షాకాలం వస్తే రోడ్లపై నడవలేక అగచాట్లు పడుతున్నాం. మార్కాపురం రావాలంటే 2 కొండలు ఎక్కి దిగాలి. చాలా దూరం వరకూ తారురోడ్డు లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. గ్రామ పంచాయతీకి వచ్చే నిధులు ఏ మాత్రం సరిపోవటం లేదు. కొత్త కాలనీలు ప్రారంభించేంత వరకు రోడ్లయినా మరమ్మతులు చేయండి. మా కష్టాలు ఎప్పుడు తీరతాయో.

– తుమ్మా వెంకటరెడ్డి, గొట్టిపడియ

“ మా తండా చాలా అధ్వానంగా ఉంది



అక్కచెరువు తండాకు వస్తే ఎంత అధ్వానంగా జీవిస్తున్నామో అధికారులకు తెలుస్తుంది. తండాకు వచ్చేందుకు ఉన్న రోడ్డు మొత్తం గుంతలు పడిపోయింది. తండాలో అంతర్గత రోడ్లు లేవు. మురుగునీరు ఇళ్ల ముందే ఉంటుంది. కరెంట్ పోతే మరుసటి రోజు వరకు రాదు. అధికారులు స్పందించి మా సమస్యలు తీర్చాలి. మార్కాపురం రావాలంటే చాలా ఇబ్బందులు పడతాం. ఎవరికైనా అనారోగ్య సమస్యలు వస్తే మా కష్టాలు దేవుడికెరుక. అంబులెన్స్ రావడం కూడా కష్టమే.

– బ్రహ్మయ్య నాయక్, అక్కచెరువు తండా

పేదల వైద్యంపై కూటమి ఉక్కుపాదం

- ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటుకు అంటే వైద్యశాలలు కూడా ప్రైవేటుకే
- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రకాశం జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆందోళన
- పీపీపీని ఆపకపోతే రిలే నిరాహార దీక్షలకు సిద్ధమన్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకులు



జేసీకి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు

ఒంగోలు సబర్బన్: ''పేదల వైద్యంపై టీడీపీ కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. పేదలను ప్రైవేటు వైద్యశాలల చుట్టూ తిరిగి ఉన్న సొమ్ము కాస్తా కాజేసుకొని అప్పుల పాలై చివరకు ప్రాణాలను పోగొట్టుకోమంటోందని'' వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు గళమెత్తారు. కూటమి ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఒంగోలులో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నగరికంటి శ్రీనివాసరావుతో పాటు వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకులు మాట్లాడుతూ పేద పిల్లల వైద్య విద్యకు అడ్డుపడుతున్న కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లాయన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను, వాటికి అనుసంధానంగా ఉండే ప్రభుత్వ వైద్యశాలలను ప్రైవేటు పరం చేయటం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. చంద్రబాబు జీవితం అంతా ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు పరం చేయటమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు తొలి విడతలో భాగంగా ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల కాలేజీలు పీపీపీ పద్ధతిలో అప్పగించేందుకు టెండర్ నోటిఫికేషన్ ఇచ్చిందని వివరించారు. మెడికల్ కాలేజీలు, 625 పథకాల వైద్యానికి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల పీపీపీకి టెండర్లను పిలిచిందని చెప్పారు. 2019-2024 మధ్యకాలంలో రాష్ట్రంలో 17 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అప్పట్లో ప్రారంభించిన వాటిలో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కాలేజీలు 2023-24 విద్యా సంవత్సరం నుంచి క్లాసులు కూడా ప్రారంభమయ్యాయన్నారు. 750 సీట్లతో విద్యార్థులను చేర్చుకొని వైద్య విద్యను అభ్యసిస్తున్నారని గుర్తు చేశారు. జిల్లాకో మెడికల్ కాలేజీ ఉండాలని, సామాన్యులకు కూడా వైద్య విద్య అందుబాటులోకి రావాలన్న ఉద్దేశంతో అప్పటి సీఎం వైఎస్ జగన్ ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక మెడికల్ కాలేజీని స్థాపించారన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు పాలనలో ఒక్క మెడికల్ కాలేజీని కూడా స్థాపించలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి అందుకోసం రూ.8.480 కోట్లు కేటాయించారని చెప్పారు. పాడేరు, మదనపల్లె, ఆదోని, మార్కాపురం, పులివెందుల, పిడుగురాళ్లలోని కాలేజీలు 2024-25 విద్యా సంవత్సరంలో ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, సరైన మౌలిక సదుపాయాలు, బోధనా సిబ్బంది లేకపోవడంతో నేషనల్ మెడికల్ కమిషన్ నుంచి అనుమతి పొందలేకపోయాయని కూటమి ప్రభుత్వం చెబుతోందన్నారు. ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నరసీపట్నం, బాపట్ల, పార్వతీపురంలలో పీపీపీ మోడల్‌లో తెలుగుదేశం పార్టీ పారిశ్రామికవేత్తలకు, తన తాబేదార్లకు చంద్రబాబు కట్టబెట్టుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీపీపీ మోడల్ అంటే ప్రైవేటీకరణేనన్నారు. రూ.8 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కేవలం సంవత్సరానికి రూ.5 వేలకే ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా ప్రజల ఆస్తులను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు.

ప్రైవేటు వైద్య కళాశాలల్లో అన్నీ అవకతవకలే..

ప్రైవేటు వైద్య కళాశాలల్లో అన్నీ అవకతవకలే జరుగుతున్నాయన్నారు. 17 అంశాలకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని ప్రైవేటు మెడికల్ కాలేజీలను రాష్ట్ర విజిలెన్స్ శాఖ కోరిందన్నారు. మొత్తం 29 ప్రైవేటు కాలేజీలను ఈ వివరాలివ్వాలని విజిలెన్స్ విభాగం అధికారులు కోరారని అందులో 15 కాలేజీలు స్పందించగా, 6 కాలేజీలు కొత్తగా వచ్చామని, నాలుగేళ్ల పూర్తి బ్యాచ్‌లు రాలేదని తెలిపాయన్నారు. 4 కాలేజీలు అరకొర సమాచారం ఇవ్వగా, మరో నాలుగు కాలేజీలు వివరాలేవీ ఇవ్వలేదు. కొన్ని కాలేజీలు తప్పుడు సమాచారం ఇచ్చినట్టుగా గుర్తించినట్లు చెప్పారు. జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి న్యాయవాదులు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాల కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. అంబేద్కర్ భవన్ నుంచి ప్రకాశం భవన్ వరకూ సాగిన ర్యాలీ మధ్యలో బీఆర్ అంబేద్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు ధర్నాసి హరిబాబు, కొండపి నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు దారా మాధవరావు, మార్కాపురం నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు భూపని కాశయ్య, దర్శి నియోజకవర్గం నుంచి నల్లమలపు సుబ్బారెడ్డి, యర్రగొండపాలెం లీగల్ సెల్ నియోజవర్గ అధ్యక్షుడు ఎం సుబ్బారెడ్డి, ఒంగోలు సిటీ లీగల్ సెల్ ప్రెసిడెంట్ కాకుటూరి సంపత్ కుమార్, సీనియర్ న్యాయవాదులు చావలి రమేష్ బాబురావు, కాకుటూరి బాబు రావు, జిల్లా లీగల్ కమిటీ సభ్యులు భీమిరెడ్డి నాగ మల్లేశ్వర రెడ్డి, పెళ్లూరు రామకృష్ణ, ధర్నాసి రామా రావు, గల్లి చౌడేశ్వర రావు, ఎరువ వెంకటేశ్వర రెడ్డి, ఒంగోలు సిటీ సమాచార హక్కు చట్ట విభాగం ప్రెసిడెంట్ తోట సుధా రాణి, ఒంగోలు నియోజకవర్గ సమాచార హక్కు చట్ట విభాగం అధ్యక్షుడు కే. శేషా రెడ్డి, ఒంగోలు సిటీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు షేక్ హిదయ్యతుల్లా, హనుమంతునిపాడు ఎంపీపీ, న్యాయవాది గాయం సావిత్రి, పొదిలి న్యాయవాది గాదె సుజాత పాల్గొన్నారు.

పోలీసులను అడ్డుపెట్టుకుని
కూటమి అరాచకాలు



డిజిటల్‌బుక్ ఆవిష్కరిస్తున్న చుండూరి రవిబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, నాయకులు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, బత్తుల
- డిజిటల్ బుక్ యాప్ ఆవిష్కరణ

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డంగా పెట్టుకుని అరాచకాలకు పాల్పడుతోంది వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ధ్వజమెత్తారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డితో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరి మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ వేధింపులకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. ప్రభుత్వ చర్యలను హైకోర్టు సైతం గుర్తించిందన్నారు. చిన్న బడ్డీకొట్టు పెట్టుకుని జీవిస్తున్న సోషల్‌మీడియా యాక్టివిస్ట్ సౌందరరెడ్డి కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించినందుకు పోలీసులతో అక్రమ అరెస్టు చేయించిందన్నారు. దీనిపై హైకోర్టు జోక్యం చేసుకుని పోలీసుల తీరును ప్రశ్నించిందని, పోలీసులు మఫ్టీలో వచ్చి మంగళగిరిలో ఆయన్ను కిడ్నాప్ చేశారన్నారు. ఈ విషయంలో పోలీసులు తప్పుడు సమాచారం ఇచ్చారని గుర్తించిన హైకోర్టు సీబీఐ విచారణకు ఆదేశించడం ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదన్నారు.

పార్టీ నేతలకు భరోసా ఇచ్చేందుకు యాప్..

తమ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కూటమి ప్రభుత్వ పెద్ద వేధింపులకు గురిచేస్తున్నారని చుండూరి ఆరోపించారు. బాధితులందరికీ అండగా నిలిచేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తెచ్చారన్నారు. తమ పార్టీ వారికి రాష్ట్రంలో ఎక్కడైనా అన్యాయం జరిగినా డిజిటల్ బుక్‌లో నమోదవుతాయని చెప్పారు. బాధితులకు అన్ని రకాలుగా పార్టీ అండగా నిలుస్తోందన్నారు. చంద్రబాబు పవన్‌కళ్యాణ్‌కు ఇస్తున్న ప్రాధాన్యతను ఓర్చుకోలేక, చిరంజీవికి సమాజంలో ఉన్న గౌరవాన్ని ఓర్చుకోలేక, అసెంబ్లీలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పై, చిరంజీవిపై బాలకృష్ణ అసభ్యకరంగా మాట్లాడారని విమర్శించారు. బాలకృష్ణ అసెంబ్లీలో ఊగుతూ మాట్లాడారని, ఆయన ఏస్థితిలో ఉన్నారో ప్రజలందరూ చూశారన్నారు.

మాట్లాడితే గొంతు నొక్కేలా కూటమి కుట్రలు:

కూటమి ప్రభుత్వ విధానాలపై ఎవరైనా గొంతెత్తి మాట్లాడితే వారి గొంతు నొక్కేలా కూటమి కుట్రలు చేస్తోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. ఎవరైతే మాట్లాడతారో వారిపై అక్రమ కేసులు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. మార్టూరు మండలంలోని ద్రోణాదుల సర్పంచ్ అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడిన మాటలను సోషల్‌మీడియా తీవ్రంగా ఖండిస్తే, పోలీసులు వచ్చి సాకులు చెప్పి అరెస్ట్ చేశారని, ఇది దారుణమన్నారు. చిన్న చిన్న ఘటనలపై సైతం నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి వారి కుటుంబ సభ్యులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వాన్ని ఎవరైతే ప్రశ్నిస్తారో వారిపై రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ కేసులు బనాయించి వారి కుటుంబాలను క్షోభకు గురి చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శులు వై.వెంకటేశ్వరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు రొండా అంజిరెడ్డి, దాసరి కరుణాకర్, పాలడుగు రాజీవ్, ఎం.దేవా, వేముల శ్రీకాంత్, పులుసు సురేష్, పిగిలి శ్రీనివాసులు, సురేందర్ రెడ్డి, కూనం గౌతమ్, పెట్లూరి ప్రసాద్, పణిదపు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



వాగు ఉధృతితో నీటమునిగిన ప్రతాప్‌రెడ్డి కాలనీకి వెళ్లే రోడ్డు

ఉప్పొంగిన సగిలేరు వాగు

గిద్దలూరు రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా కురిసిన వర్షంతో మండలంలోని సగిలేరు వాగు ఉప్పొంగింది. నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షంతో దిగువమెట్ట సమంలో సగిలేరు వాగు శనివారం ఉధృతంగా ప్రవహించింది. భీమలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి ప్రతాప్‌రెడ్డికాలనికి వెళ్లే రోడ్డు వాగు ఉధృతం కారణంగా రోడ్డు నీటమునిగింది. కొండపేట సమీపంలో ఆంజనేయ స్వామి ఆలయం వెనుకాల మీదుగా సగిలేరువాగు ప్రవహించడంతో జగనన్న కాలనికి వెళ్లేందుకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

వైఎస్సార్ సీపీ జిల్లా టీచర్ల విభాగ అధ్యక్షునిగా రామిరెడ్డి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా టీచర్ల విభాగం అధ్యక్షునిగా కనిగిరి నియోజకవర్గానికి చెందిన కల్లూరి రామిరెడ్డిని నియమించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన్ను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

30న పోస్టల్, టెలిగ్రాఫ్ ఎంప్లాయిస్ మహాజన సభ

ఒంగోలు వన్‌టౌన్: పోస్టల్, టెలిగ్రాఫ్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ గృహనిర్మాణ సంఘం లిమిటెడ్ మహాజన సభను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఎస్ రంగారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు సత్యనారాయణపురంలోని సంఘ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత ఐదేళ్లలో మృతి చెందిన సంఘ సభ్యుల కుటుంబ సభ్యులు సమావేశానికి హాజరై వివరాలు తెలపాలని కోరారు.

క్లుప్తంగా

కారు ఢీకొని యువకుడు మృతి

మద్దిపాడు: కారు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడు గ్రామానికి చెందిన ఎల్లంటి సురేష్ (31) ఒంగోలు నుంచి ఏడుగుండ్లపాడు చేరుకుని జాతీయ రహదారికి రెండోవైపున్న ఎస్సీకాలనీలోకి వెళ్లడానికి ఫ్లైఓవర్ రైలింగ్ దాటే క్రమంలో ఒంగోలు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ఘటన స్థలంలోనే సురేష్ మృతి చెందాడు. కారు ఆగకుండా వెళ్లిపోగా, కారు నంబర్ ప్లేట్ ఊడిపోయి మృతుని బంధువులకు దొరికినట్లు సమాచారం. మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు మద్దిపాడు పోలీసులు తెలిపారు.

కోతుల దాడిలో మహిళలకు గాయాలు

గిద్దలూరు రూరల్: కోతులు దాడి చేయడంతో ఇద్దరు మహిళలకు గాయాలైన సంఘటన గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు గ్రామంలో శనివారం జరిగింది. కోతుల సమూహం గ్రామంలోకి ప్రవేశించి ఓ ఇంటి వద్ద ఉన్న మహిళలపై దాడి చేయడంతో షేక్ సైదమ్మ, ఆకుల రమణమ్మ కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలు ప్రారంభం



పోటీలో తలపడుతున్న ప్రకాశం, ఈస్ట్ గోదావరి జిల్లా బాలుర జట్లు

ఒంగోలు: రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలు శనివారం స్థానిక మినీ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. 15 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రారంభ కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ డాక్టర్ కామేపల్లి శీతారామయ్య, సెపక్ తక్రా అసిసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీ శ్రీనివాస్, జిల్లా చైర్మన్, అధ్యక్షులు, కార్యదర్శులు డాక్టర్ కృష్ణ సాయి, యనమల సురేష్, డి.రవిప్రసాద్‌తో పాటు జిల్లా కోచ్ బి.శ్రీనివాస్‌లు పాల్గొని పోటీలను పర్యవేక్షించారు. ఈ పోటీలు ఆదివారం ముగియనున్నాయి.

నేడు క్రెడాయ్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం

ఒంగోలు వన్‌టౌన్: క్రెడాయ్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశాన్ని ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఒంగోలు అధ్యక్షుడు రాజేంద్ర, కార్యదర్శి ప్రసన్నాంజనేయులు, కోశాధికారి మునగా తిరుమల శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని గుంటూరు రోడ్డులో గల పీఏజీ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



లోపల, బయట ప్రయాణికులతో నిండిపోయిన ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్



అధిక సంఖ్యలో బస్సు ఎక్కుతున్న మహిళలు

బస్సులెక్కగలవా.. ఓ నరుడా..!

కూటమి ప్రభుత్వ నిర్వాకంతో బస్సులెక్కాలంటేనే భయపడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రయాణికులకు సరిపడా సర్వీసులు ఏర్పాటు చేయకుండానే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించడంతో జిల్లాలో అరకొరగా నడుస్తున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగి రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో జిల్లాలోని ప్రయాణికులకు బస్సులెక్కడం అనేది ఒక సవాలుగా మారింది. ఒకవేళ ఎలాగోలా అష్టకష్టాలుపడి తోటివారిని తోసుకుంటూ బస్సు ఎక్కినా సీటు దొరకడం గగనమైంది. ఈ రెండూ సజావుగా జరిగి గమ్యస్థానానికి చేరితే ఆ రోజుకి గండం గట్టెక్కినట్లే అన్నట్టుగా పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం దసరా సెలవుల నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు, బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు అన్ని పట్టణాల్లోని బస్టాండ్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతరత్రా ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఇప్పటికే పాఠశాలలకు సెలవులు ఇవ్వడం, శనివారం నుంచి కళాశాలలకు కూడా సెలవులు కావడంతో ఒక బస్సు వస్తే ఎక్కేందుకు 120 నుంచి 150 మంది వరకూ ప్రయాణికులు పోటీపడుతున్నారు. ప్రభుత్వం బస్ సర్వీసులు పెంచకపోవడంతో వచ్చిన బస్సు మిస్సయితే మళ్లీ బస్సు ఉంటుందో ఉండదో తెలియక ఎలాగైనా అదే బస్సు ఎక్కాలనే ప్రయత్నంలో తీవ్రంగా తోసుకుంటున్నారు. బస్సులో సీట్ల కోసం పోటీపడే క్రమంలో ఏకంగా ప్రయాణికుల మధ్య వాదనలు, ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి వీడియోలు ఇటీవల సోషల్ మీడియా ట్రోల్ కూడా అవుతున్నాయి. దీనంతటికీ కారణం రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికులకు సరిపడా ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేయకపోవడమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

– సాక్షి, ఒంగోలు







సీట్ల కోసం పాట్లు





బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు



దసరా సెలవులకు స్వగ్రామాలకు చేరేందుకు బస్టాండ్‌కు చేరుకున్న విద్యార్థులు



కిక్కిరిసిన బస్సుల్లో ఎక్కలేక ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

టీడీపీ నాయకుడి దౌర్జన్యంపై బాధితుల నిరసన

ఒంగోలు వన్‌టౌన్: ఒంగోలు నెహ్రూకాలనీలో గత 20 సంవత్సరాలుగా తాము నివాసం ఉంటున్న గృహాన్ని కూలగొడతామని టీడీపీ నాయకుడు పసుపులేటి శ్రీను బెదిరిస్తున్నాడంటూ శనివారం బాధితులు నిరసన వ్యక్తం చేశారు. దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ ఆధ్వర్యంలో ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ మాల కులానికి చెందిన ఈద జాస్మిన్, విజయల కుటుంబం నెహ్రూ కాలనీలో గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిలో నివాసం ఏర్పాటు చేసుకుని ఇంటి పన్ను, కుళాయి పన్నులను ప్రభుత్వానికి చెల్లిస్తూ ఉంటోందని తెలిపారు. అయితే, అదే ప్రాంతానికి చెందిన బిల్డర్ అపార్టుమెంటు కట్టేందుకు ప్రయత్నిస్తూ వీరి కుటుంబానికి చెందిన గృహాన్ని కూలగొట్టేందుకు మున్సిపల్ అధికారులతో కలిసి కుట్రలు చేస్తున్నాడన్నారు. టీడీపీ నాయకుడు పసుపులేటి శ్రీను, మున్సిపల్ అధికారులు కూడా బాధితులను బెదిరిస్తున్నారన్నారు. దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ డీఆర్ఓ ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో కె.జయకుమార్, ఎస్‌కే జిలానీ, సీహెచ్ సంపత్ కుమార్, బాధితులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు

రాయలసీమ వెళ్లే వాహనాల దారి మళ్లింపు



సిద్ధాపురం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



పెద్దదోర్నాలలో వాహనాలను దారిమళ్లిస్తున్న అధికారులు

- బైర్లూటి చెరువు నిండి రోడ్లపై నీరు పారుతుండటంతో డైవర్షన్

పెద్దదోర్నాల: మండల కేంద్రం నుంచి రాయలసీమ వైపునకు వెళ్లే వాహనాలను అధికారులు శనివారం దారి మళ్లించారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలంలోని బైర్లూటి వద్ద ఉన్న సిద్ధాపురం చెరువు పూర్తిస్థాయిలో నిండిపోయింది. దీంతో అధికారులు చెరువు అలుగు ద్వారా వరద నీటిని వదలడంతో రోడ్డుపై భారీగా నీరు చేరి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యగా రహదారిని మూసివేయడంతో మండల కేంద్రం మీదుగా రాయలసీమ వైపు వెళ్లే అన్ని వాహనాలను దారి మళ్లించారు. గుంటూరు, తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు గిద్దలూరు, నంద్యాల మీదుగా కర్నూలు, తదితర ప్రాంతాల మీదుగా వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ఐనముక్కల వద్ద ఏఎస్సై కృష్ణమూర్తి, రైటర్ మోహన్ పర్యవేక్షించారు.

ఎయిడెడ్ విద్యార్థుల కోసం నవంబర్ 14న నిరాహార దీక్ష

ఒంగోలు సిటీ: జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైనందుకు నిరసనగా నవంబరు 14న సర్వశిక్షా అభియాన్ కార్యాలయాల వద్ద నిరాహారదీక్ష నిర్వహించనున్నట్లు ఏపీ టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న 135 ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు సర్వశిక్షా అభియాన్ ద్వారా ప్రభుత్వం విద్యార్థులకిచ్చే అన్ని రకాల వసతులు కల్పించాలని కోరారు. విద్యార్థులకు మంచినీటి వసతి, టాయిలెట్ క్లీనింగ్, మెటీరియల్, తరగతి విద్యకు సంబంధించి ఎఫ్ఎల్ఎన్ ప్యానల్ కిట్లు, తరల్ కిట్లను నవంబర్ 10వ తేదీలోపు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లాలోని అన్ని ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులతో సర్వశిక్షా అభియాన్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తామని స్పష్టం చేశారు.



వాసవీమాత అలంకరణలో వాసవీకన్యకాపరమేశ్వరిదేవి



ఒంగోలు కేశవస్వామిపేటలో యాపిల్ పండ్ల అలంకరణలో వేపచెట్టు కనకదుర్గాదేవి



శాకాంబరీదేవి అలంకరణలో గంటాపాలెం పార్వతీదేవి

కరుణించమ్మా కనకదుర్గమ్మా..

దసరా వేడుకలను జిల్లాలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. శనివారం ఆరో రోజు అమ్మవార్లను వివిధ రూపాలలో అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

– సాక్షి, ఒంగోలు



లలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో కేశవస్వామిపేటలో విజయదుర్గాదేవి



చీమకుర్తి హరిహరక్షేత్రంలో లలితాత్రిపురసుందరిదేవి అలంకరణ



సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో..





లలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో బాలాజీరావుపేట కనకదుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఒంగోలు లాయరుపేట సాయిబాబా ఆలయంలో లలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో రాజరాజేశ్వరీదేవి